క్లుప్తంగా

కమిటీ ఎన్నిక

కాటారం: ఐసీడీఎస్ మహదేవపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీని మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలిగా శ్రీలతారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా అన్నపూర్ణ, కోశాధికారిగా నిర్మల, కార్యదర్శిగా పద్మ, ఉపకార్యదర్శిగా స్వరూప, సభ్యులుగా భీమక్క, దేవి, కల్పన, రమ, సారక్క, రజిత ఎన్నికయ్యారు. నూతన కమిటీ నియామకంపై హర్షం వ్యక్తం చేస్తూ పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జెండా ఎగరాలి



ములుగు రూరల్: వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరాలని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అబ్బాపూర్ సర్పంచ్ గండి కల్పన-కుమార్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, ఉప సర్పంచ్ నల్లెల్ల ప్రభాకర్ జెడ్పీ చైర్‌పర్సన్‌సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నాగజ్యోతి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్, మసరగాని వినయ్‌కుమార్, భిక్షపతి, రమేష్‌రెడ్డి, చిక్కుల రాములు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



ఏటూరునాగారం : మండలంలోని వీరాపురం కోయ చెరువు వద్ద నివాసం ఉంటున్న వరద బాధిత గిరిజనులకు ఈస్టర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, చెల్పాక ఎంపీటీసీ కోట నర్సింహులు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గిరిజనుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు ఇటీవల వరదలతో ఇబ్బందులు పడినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈస్టర్ సంస్థ అధ్యక్షుడు సునీల్ సింగాడె, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యశ్రీ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయ ఈస్టర్ యూనిట్ కోశాధికారి పద్మిని, బీఆర్ఎస్ నాయకులు కూనూరు మహేష్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



ఏటూరునాగారం : మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు సర్వ అక్షిత్ ఆధ్వర్యంలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రచారం, నాయకుల గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలను వివరించినట్లు సర్వ అక్షిత్ మీడియాకు తెలిపారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో యూత్ కాంగ్రెస్ టౌన్ కమిటీ అధ్యక్షుడు బండారు లక్కీ, నాయకులు సర్వ సాయి, బానోతు లకన్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

ములుగు రూరల్ : మండలంలోని జాకారం గ్రామానికి చెందిన చతుర్వేదుల శ్రీకాంత్, రుద్రబోయిన రఘుపతి, కలువల రజిత, కాలువులపెద్ది రాజయ్య, మోరె సమ్మయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు లాల్‌పాషా, ప్రతాప్, లద్దునూరి శ్రీను, జానీ, శ్రీనివాస్, వేణు, కనుకయ్య, రమేష్, శంకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితేనే మెరుగైన ఫలితాలు

ములుగు రూరల్ : ప్రణాళికతో చదివితేనే మెరుగైన ఫలితాలు వస్తాయని ఏటీడీఓ దేశీరాం విద్యార్థులకు స్పష్టం చేశారు. గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి గ్రామంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి 10 జీపీఏ సాధించాలని తెలిపారు. మెనూ అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ బాలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?

అధ్వానంగా పలుగుల-కుంట్లం రోడ్డు

- ప్రజలకు తప్పని తిప్పలు
- వర్షాకాలంలో అంబులెన్స్ రాలేని దుస్థితి
- ప్రతిపాదనలు పంపినా మంజూరులో తాత్సారం



బురదమయమైన పలుగుల-కుంట్లం రోడ్డు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని పలుగుల-కుంట్లం రోడ్డుకు మోక్షమెప్పుడో అని ప్రజలు ఆందోళనకు గురౌతున్నారు. ఆ రహదారి నిర్మాణం అందని ద్రాక్షగానే మిగులుతోంది. రోడ్డు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్ధరాత్రి ఆపదొస్తే అంబులెన్స్ సైతం గ్రామంలోకి రాలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తుండడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం, అధికారులు కనీసం రోడ్డుకు మరమ్మతులు కూడా చేయించడం లేదని గ్రామస్తులు బహిరంగంగానే మండిపడుతున్నారు. గ్రామస్తులు పలుమార్లు ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మంత్రులకు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదు. మద్దులపల్లి క్రాస్ రోడ్డు నుంచి కుంట్లం వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ దారిలో ద్విచక్ర వాహనం సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితులున్నాయి. పలుగుల గ్రామ పంచాయతీలో 1300 మంది జనాభా ఉండగా 759 మంది ఓటర్లున్నారు. అందరూ కాళేశ్వరం రాక తప్పదు. కానీ ఆ గుంతల రోడ్డు మీద ప్రయాణించాలంటే జనం బెంబేలెత్తుతున్నారు.

మోకాలు లోతు గుంతలు : మోకాలు లోతు గుంతలు, రోడ్డుకు ఇరువైపులా గాడాలు పడ్డాయి. దీంతో ప్రైవేటు వాహనాలు కూడా రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కాళేశ్వరం వైపు రావాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. రోడ్డు బాగా లేకపోవడంతో ఆయా గ్రామాలకు విద్య, వైద్యం, రవాణా ఆమడ దూరంలో ఉన్న దారుణం కనపడుతోంది. 8, 9, 10 తరగతుల, కాలేజీ విద్యార్థులు ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే హడలిపోతున్నారు. ఈ సమస్యతోనే ఇతర ప్రాంతాల్లోనే చదువుకుంటున్నారు.

కలెక్టర్ చొరవ తీసుకోవాలి

వర్షాకాలం మూడు నెలలు మా కష్టాలు చెప్పనలవి కాదు. రోడ్డు మంజూరీ, నిర్మాణంలో రాజకీయ పార్టీలు శ్రద్ధ చూపడం లేదు. జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. ఆపదొచ్చినా రాత్రివేళల్లో ప్రయాణమంటే భయమేస్తోంది. బురద, మోకాలు లోతు గుంతలతో ప్రాణాపాయం ఉంది. ఇటీవల రాత్రి సమయంలో పలుగులకు చెందిన మహిళ కడుపు నొప్పితో వేదనకు గురికాగా ఐదు కిలోమీటర్ల దూరంలోనే అంబులెన్స్ నిలిచింది. ఆమెను కుటుంబ సభ్యులు తీసుకెళ్లి అంబులెన్స్ ఎక్కించి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

రూ.9కోట్ల అంచనాతో ప్రతిపాదనలు

పలుగుల-కుంట్లం మధ్య 5.5 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ప లుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. సుమారు రూ.9 కోట్ల అంచనాతో నివేదిక అందజేశాము. అయినా ఇప్పటికీ రోడ్డు మంజూరు కాలేదు.

\- ఈ.సాయిలు, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు

భూపాలపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరించడంతో మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీచర్లు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటాలకు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంపు శోభారాణి, చెన్నోజు అరుణ మాట్లాడారు. ఆందోళనలు నిర్వహించకున్నా సీఎం కేసీఆర్ మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ఉన్నతీకరించారని తెలిపారు. తమ సేవలను సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత గుర్తించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్సీ కవితకు, మంత్రి సత్యవతి రాథోడ్‌లకు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్టీయూ మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు గుగులోతు విజయలక్ష్మీ, టీచర్లు పద్మ, రమ, శైలజ, సరళ, సమ్మక్క, శారద, సుశీల, మంజుల, కోమల, దివ్య, నవ్య, అమూల్య, సరళ, కోమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పంటనష్ట పరిహారం ఇవ్వాలి



రైతులతో మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మల్లారం గ్రామ శివారులోని వరదలతో ముంపునకు గురైన పంట భూములను ప్రజాసంఘాల నాయకులు ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు పడి నెల రోజులు దాటుతున్నా నష్టపోయిన రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించే బాధ్యత ప్రభుత్వం తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కర్ణాటక సమ్మయ్య, పీక కిరణ్, అక్కల బాపు, రైతులు బబ్బిలి రమేష్, లింగన్నపేట మురళి, కట్టెకోల్ల సమ్మయ్య, మెచినేని రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మొగుళ్లపల్లి: పదవ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కాల్నల్ అజయ్ నందన్‌కందూరి ఆదేశానుసారం మొట్లపల్లి గ్రామంలో ఎన్‌సీసీ అధికారి రాజయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సీసీ విద్యార్థులు ఓటరు నమోదు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులతో గ్రామంలోని 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకొని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు వేసి అభ్యర్థులను ఎన్నుకోవాలని నినాదాలు చేస్తూ వీధుల వెంట తిరిగి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహస్వామి మాట్లాడుతూ.. ఓటు నమోదు, ఓటు వేయించు విధానం విద్యార్థులకు తెలియజేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఈ అవకాశాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, మధుసూదన్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యమంతోనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు



జేఏసీ నాయకులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కాటారం: మండల కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో చేసిన ఉద్యమంతోనే కాటారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయిందని కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కాటారం రెవెన్యూ డివిజన్ కోసం 45 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేసిన జేఏసీ నాయకులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కృషి చేసిన జేఏసీ చైర్మన్ కరుణాకర్‌రావు, కన్వీనర్ బొమ్మ సమ్మిరెడ్డి, ఇతర సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా ఐదు మండలాల ప్రజలు మొరపెట్టుకున్న పట్టించుకోని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల కోసమే ప్రకటించారని ఆరోపించారు. రెవెన్యూ డివిజన్ మేమే తెచ్చామని చెప్పుకుంటున్న భూపాలపల్లి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్లు ప్రజలు డిమాండ్ చేసినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధు ఏనాడు అయిన అసెంబ్లీలో ప్రస్తావించాడా అని అన్నారు. శ్రీధర్‌బాబు డిమాండ్‌తోనే నేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో మహదేవపూర్ జెడ్పీటీసీ గుడాల అరుణ, సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అశోక్, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కుంభం స్వప్న, రమేశ్‌రెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిగౌడ్, శ్రీహరి, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఓటరు జాబితా రూపొందించాలి



పోలింగ్‌బూత్ వద్ద ఓటరు నమోదు పరిశీలిస్తున్న ఆర్డీఓ

కాటారం: సంపూర్ణమైన ఓటర్ జాబితాను రూపొందించడానికి రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు కృషి చేయాలని మంథని ఆర్డీఓ హనుమానాయక్ సూచించారు. ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు కాటారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. ఓటర్ నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఓటు హక్కు లేని అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తు స్వీకరించి ఓటు నమోదయ్యేలా చూడాలన్నారు. ఇంటి నంబర్లు తప్పుగా ఉన్న ఓటర్ల వివరాలను పరిశీలించి సవరించాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల గూర్చి సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి డెత్ సర్టిఫికెట్ నిర్ధారణ చేసుకొని జాబితా నుంచి తొలగించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేని ఓటర్ జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకన్న ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా శ్రీకాంత్



మహాముత్తారం: బీజేపీ యువ మోర్చా మండల అధ్యక్షుడిగా మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామానికి చెందిన బండా శ్రీకాంత్‌ను నియమించారు. ఆదివారం మంథని నియోజకవర్గ కేంద్రంలో అస్సాం శాసనసభ్యుడు సుశాంత్ చేతుల మీదిగా నియామక పత్రాన్ని అందజేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా కనుకునూర్ గ్రామానికి చెందిన పులిసె కవితను మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా నియమించినట్లు మండల అధ్యక్షుడు సంపత్ తెలిపారు.

నియామకం



ఎన్నికైన కమిటీ సభ్యులు

కాటారం: కిసాన్ సేవా సంఘం పర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ కంపెనీల ఎంప్లాయీస్ యూనియన్ మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా నిడిగొండ చెన్నకోశవ్, కోశాధికారిగా ఇప్పలపల్లి దేవేందర్‌ను, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

వ్యవసాయ అధికారి బదిలీ

మల్హర్: మండల వ్యవసాయ అధికారి(ఏఓ)గా విధులు నిర్వహిస్తున్న ముంజ మహేష్ ఆదివారం బదిలీ అయ్యారు. అతని స్థానంలో మంచిర్యాల జిల్లా నుంచి సుధాకర్ వస్తున్నట్లు సమాచారం. ఏఓ మహేష్ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న రమేశ్

కాటారం: నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని, చేవెళ్ల సభలో జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటననే నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండ్రు రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ఇచ్చిన హామీలను హర్షిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేయడంతో పాటు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా దండ్రు రమేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే దళితులు, గిరిజనులకు న్యాయం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో దళితులు, గిరిజనుల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో దళిత, గిరిజనుల స్థితిగతులు మారుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పంతకాని సమ్మయ్య, మల్హర్‌రావు, జెడ్పీటీసీ గుడాల అరుణ, సర్పంచ్‌లు దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, అశోక్, ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, కుంభం స్వప్న, రమేశ్‌రెడ్డి, సమ్మిరెడ్డి, తిరుపతిగౌడ్, శ్రీహరి, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీని ఆదరించాలి



పాదయాత్ర ముగింపులో మాట్లాడుతున్న రమేష్

మొగుళ్లపల్లి : ధర్మసమాజ్ పార్టీని ఆదరించాలని ప్రజలను ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీసభ్యుడు మంద రమేష్ కోరారు. గడపగడపకుపరిచయ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఆ పార్టీ చేపట్టిన పాదయాత్ర ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. ప్రజలు అగ్రవర్ణ పార్టీలను నమ్మొద్దని కోరారు. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు అగ్రకులాల చేతిలోనే ఉన్నాయని తెలిపారు. ఏడు శాతంగా ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కోసం పార్టీ పోరాడుతోందని వివరించారు. ఓటుతో అగ్రకుల పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రచార కమిటీ సభ్యులు జన్నె లక్ష్మణ్, దూడపాక రాజు, శ్రీకృష్ణ, మనోజ్, రవికుమార్, వంశీ, సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

తస్లీమా సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు: జిల్లా ప్రజలకు తస్లీమా మహ్మద్ అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం డాక్యుమెంట్ రైటర్లు, శ్రేయోభిలాషులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులం, మతం సంబంధం లేకుండా ఎక్కడ కష్టం వచ్చినా తస్లీమా సహకరించుకుంటూ వస్తుందని అన్నారు. ములుగు నుంచి దూరమైన ప్రజల మనస్సుల్లో నిలిచి ఉంటుందని అన్నారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మాట్లాడుతూ.. ములుగు నుంచి బదిలీ అయినా తండ్రి పేరిట ఏర్పాటుచేసిన సర్వర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆపదలో ఉన్న వారికి సాయం అందిస్తానని అన్నారు. ఉద్యోగ పరంగా మహబూబాబాద్ వెళ్లిన నియోజకవర్గ బిడ్డగానే కొనసాగుతానని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్, ఐక్య కార్యచరణ సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతి గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు రవిచందర్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, మహేష్, ప్రతాప్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 1990–91 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల గతంలో చోటు చేసుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు మైక్‌సెట్‌ను పూర్వ విద్యార్థులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ప్రధానోపాధ్యాయుడు పొలాల తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ఈశ్వర్‌ప్రసాద్, కోటేశ్వర్‌రావు, బక్కయ్య శాస్త్రి, వెంకటేశ్వర్, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు దొమ్మటి శంకర్, పూర్వ విద్యార్థులు సోరుపాక సదయ్య, పెండెం రాజు, అడిచర్ల శ్రీనివాస్, కట్కం శ్రీనివాస్, కుదురుపాక కిరణ్, గుడిమె సదయ్య, ఏకు సదానందం, పెర్కారి వాణి, గీద సుజాత, గీద శ్రీదేవి, ఆడెపు శారద, బొజ్జపెల్లి స్వరూప, మారం సత్యదేవి, బూరుగు మహేందర్, మడిపోజు రవీందర్, వీరవేని శంకర్, పెర్కారి శ్రీనివాస్, పెండెం రాజమౌళి ఉన్నారు.

మెడికల్ విద్యార్థికి ఆర్థికసాయం

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన టైలర్ హసీనా కుమారుడు తాహేర్ షరీఫ్ ఖమ్మంలో మెడికల్ సీటు పొందాడు. ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉండడంతో సోషల్ మీడియా, పత్రికల ద్వారా సమాచారం తెలుసుకున్న ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో రూ. 20వేలు, మాజీ ఎంపీపీ కోనేరు నగేష్ రూ.10వేలను అందజేశారు. అలాగే వరంగల్‌లో కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, నాయకులు కలిసి రూ. 60వేలు, ఫోన్ పే ద్వారా రూ.40 వేలు మొత్తంగా రూ. 1.30లక్షల ఆర్థిక అందించినట్లు విద్యార్థి తల్లి హసీనా తెలిపారు. సాయం చేసిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు కూనూరు మహేష్, ఖాజాపాషా, బ్లడ్ డోనర సయ్యద్ వహీద్, బండపల్లి సంతోష్, విజయ భాస్కర్, గౌతమ్ నాయుడు, చావా భాస్కర్, తడక సుమన్, పరికి వేణు, పరికి ప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410